ప్రజాశక్తి
శనివారం 5 నవంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



6న లోక్ అదాలత్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న లోక్ అదాలత్ శిబిరం నిర్వహిస్తున్నట్లు జాతీయ వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు సమర్ది రఘునాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పెదలబుడు పంచాయతీ సికోలనీ, కంటబౌసుగుడ, శరభగుడ, జెడ్పి కోలనీ గ్రామాల్లో సందర్శించి లోక్ అదాలత్ నిర్వహణ, ఆవశ్యకతలపై ప్రచారం నిర్వహించారు. పూర్వపు ఉన్న సివిల్ కేస్‌పై ఎవరైనా ఉంటే ఈనెల ఆరో తేదీన జరిగే లోక్ అదాలత్ శిబిరానికి రాతపూర్వకంగా వినతులను సమర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టి సౌజన్య, శోభ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శెట్టి భగత్‌రాం, వైసిపి నాయకులు దొన్ను పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న రఘునాథ్

మన్యంలో బంతిపూల సిరులు


బంతిపూల బుట్టలు మోసుకెళుతున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఏజెన్సీలో గిరిజనులు పూర్వం నుంచి సాగు చేస్తున్న సీతమ్మకాటుక రకం (చిన్నబంతి) పూలు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా సిరులు కురిపించనున్నాయి. గిరిజనులు సాగు చేసిన తోటల్లో అన్ని మొక్కలకు బంతిపూల కాపు విరగ్గాస్తుంది. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో బంతిపూల అమ్మకాలు జోరందుకున్నాయి.

పాడేరు పాతబస్టాండ్ మార్కెట్‌లో గత వారం రోజుల నుంచి పూల అమ్మకాలు భారీగా జరుగు తున్నాయి. స్థానిక వ్యాపారులు పోటా పోటీగానే గిరిజనుల నుంచి బంతిపూలను కొనుగోలు చేస్తున్నారు. నాలుగు కిలోలు బరువు తూగే బుట్ట బంతిపూలను రూ.200 నుంచి రూ.300 ధరల మధ్య కొంటున్నారు.

సొంతంగా బంతితోటలు సాగు:

పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లోని గిరిజనులు సొంతంగా చిన్న బంతిపూల తోటలను సాగు చేస్తున్నారు. పూర్వం నుంచి బంతిపూల సాగు ద్వారా గిరిజన రైతులకు మంచి ఆదాయం వస్తుంది. ఆక్టోబర్ నెల నుంచి జనవరి నెల వరకు నాలుగు నెలల పాటు బంతిపూల వ్యాపారం జరుగుతుంది. ఈ నాలుగు నెలల్లో బంతిపూల అమ్మకాలతో రోజువారి ఆదాయంను గిరిజన రైతులు పొందుతారు. పెట్టుబడి లేని సాగుగా చిన్నబంతిపూలు గిరిజనులను ఆదుకుంటున్నాయి. తమ గ్రామాల నుంచి బుట్టలతో పూలను మోసుకుంటూ పాడేరు మార్కెట్‌కు తరలించి అమ్మకాలు జరుపుతారు. దూర ప్రాంతాల వారు ఆటోలను, ఇతర వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పూల కాపు ఆశాజనకంగా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్:

అందంగా కనిపించే చిన్నబంతిపూలకు తెలుగు రాష్ట్రాలలోని పలు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఆనందపురం, విశాఖపట్నం, గాజువాక, రాజమండ్రి, కడియపులంక, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతితో పాటు, తెలంగాణలోని హైదరాబాద్‌కు బంతి పూలను వ్యాపారులు తరలిస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాడేరు మార్కెట్‌లో కొనుగోలు చేసిన బంతిపూలను తేలికపాటి గోనె బస్తాలలో ప్యాక్ చేసి, అనకాపల్లి జాతీయ రహదారికి వ్యాన్లలో తరలిస్తారు. అక్కడ నుంచి దూర ప్రాంతాలకు తరలిస్తారు. వ్యాపారులు కిలో రూ.100 నుంచి రూ.150 లెక్కన బంతిపూలను అమ్ముతుంటారు. విశాఖ ఉమ్మడి జిల్లాలకు మాత్రం వ్యాన్లు, ఆర్‌టిసి పార్సిల్ సర్వీసెస్‌లో తరలిస్తుంటారు. పూలమార్కెట్‌కు పేరొందిన కడియపులంకకు నేరుగా ప్రత్యేక వాహనంలో పూలను తరలిస్తున్నారు. నాలుగు నెలల పాటు బంతిపూల వ్యాపారం గిరిజన రైతులతో పాటు, వ్యాపారులకు కూడా జీవనోపాధిగా మారుతోంది.



బంతిపూలు


రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌ను సందర్శించి వస్తున్న డిఐజి హరికృష్ణ

గంజాయిపై ఉక్కు పాదం
డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలో గంజాయి రవాణా, గంజాయి సాగుపై ఉక్కు పాదం మోపినట్లు డిఐజి ఎస్.హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఏజెన్సీలో పలు పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తోటలు సాగు ప్రాంతాలను గుర్తించి వాటిని ధ్వంసం చేస్తామన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలు గురించి సాగుదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న భూముల్లో ప్రత్యామ్నాయంగా నిమ్మ, సపోటా, రాగిలా, కాఫీ, పసుపు వంటి పంటలను సాగు చేసుకునేలా ప్రోత్సహించడం జగుతుందని చెప్పారు. ఇందు కోసం 90శాతం సబ్సిడీపై అన్ని సమకూర్చడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం, ఉపాధి హామీ శాఖల ద్వారా అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన యువత చెడు మార్గాలు పట్టకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రేరణ కార్యక్రమం ద్వారా జిల్లాలో 70 మందిని ఎంపిక చేసి టాటా ట్రస్ట్ ద్వారా శిక్షణకు తమిళనాడు పంపించడం జరిగిందని చెప్పారు. శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ కల్పన ఉంటుందన్నారు. ఆడపిల్లల కోసం నర్సింగ్‌లో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టుల ప్రభావం అంతగా ఏమీ లేదన్నారు. డిఐజి వెంట అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, రంపచోడవరం ఇన్‌ఛార్జి ఎఎస్‌పి మహేంద్ర రెడ్డి, రాజవొమ్మంగి సీఐ ఆర్.రవి కుమార్, ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్, ఏపిఎస్పి బెటాలియన్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యుసిఐఎం హాస్టల్ విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి -సీలేరు : జీకే.వీధి మండలం, సీలేరు జలవిద్యుత్ కేంద్రం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.పవన్ ప్రియరాజ్ జన్మదినం సందర్భంగా యుసిఐఎం ఆధ్వర్యంలో నడుపుతున్న హాస్టల్‌లో విద్యార్థులకు శుక్రవారం భోజన భోజన, ఫలహారాలు అందజేశారు. విద్యార్థులు చలి నుంచి ఉపశమనం పొందడానికి విద్యార్థులకు ఉన్ని టోపీలను ప్రవన్‌ప్రియరాజ్, ఆయన సతీమణి చంద్రిక అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుసిఐఎం చర్చ్ పాస్టర్ మనసై, వార్డెన్ సాని తదితరులు పాల్గొన్నారు.


వితరణ చేసిన టోపీలు ధరించిన విద్యార్థులతో పవన్ ప్రియరాజ్, చంద్రిక

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పాడేరు: వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారంతో బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సుర్యలక్ష్మి తెలిపారు. చింతపల్లి మండలం కుమారవం, కొత్తూరుబయలు, కురమానపాకలు, అన్నవరం తదితర అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ, రక్త హీనతతో భాద పడుతున్న గర్భిణీలు, తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆదేశించారు. నాణ్యమైన సరుకులు సరఫరా చేయకపోతే వెంటనే తెలియ చేయాలని సూచించారు. నాడు-నేడు కింద చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించి త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాలలో హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో గర్భిణీలు, బాలింతలతో చర్చించి తగు ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలు తెలియజేసారు. ఆయా కేంద్రాలలో అందిస్తున్న సేవలపై ఆరా తీసారు. ప్రతి నెలా 25గుడ్లు, ఐదు లీటర్ల పాలు, మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, ఆయిల్ ఇస్తున్నదీ లేనిదీ ఆరా తీసారు. క్రమం తప్పకుండా ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రీ-స్కూల్ యాక్టివిటీస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సిడిపిఓ రమ్య, సూపర్వైజర్ చిన్నారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సూర్యలక్ష్మి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొర్రాలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కొర్రా సచివాలయంలోని డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. వివిధ రకాల వ్యాధులతో బాధ పడుతున్న 59 మంది వ్యాధిగ్రస్తులకు స్థానిక పి హెచ్‌సి వైద్యాధికారి పి.రాంబాబు ఇంటింటి వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి సిద్ధార్థ్, హెచ్‌వి పద్మ, హెచ్‌ఎస్ సాంబశివరావు, హెల్త్‌అసిస్టెంట్ లోవరాజు, సిహెచ్‌ఓ కోమలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు అశోక్‌కుమార్

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- పెదబయలు: శ్రీ మోద యేసు సాయి ఆటో యూనియన్ కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎస్సై పులి మనోజ్ కుమార్ ఆదేశాల మేరకు అరడకోట మైదానంలో పెదబయలు, అరడకోట, సీకరి, వనభంగి, గలగండ పంచాయతీల ఆటో వాహనదారులు, డ్రైవర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు మునగ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి వాహనదారుడు రికార్డులను, లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, అధిక వేగం, కెపాసిటీకి మించిన లోడును ఎక్కించరాదని సూచించారు. పోలీస్‌లు జారీ చేసిన పిఎస్ నెంబర్‌ను వాహనంపై కచ్చితంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పెదబయలు నుండి బంగారమెట్ట వరకు గోతుల మయంగా ప్రధాన రహదారి ఉండటంతో వీటిని పూడ్చేందుకు ఆదివారం వాహనదారులు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో ఉప అధ్యక్షుడు సీకరి సన్యాసిదొర, కార్యదర్శి కృష్ణారావు పాల్గొన్నారు.

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పిఒ తన ఛాంబర్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలు అధికారులు ముందుగా ఐదు గ్రామాలను ఎంపిక చేసుకుని అక్కడి రైతులతో మమేకమై వారికి మక్కువ ఉన్న పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజన రైతులు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు ఏ చర్యలు తీసుకున్నది వ్యవసాయ శాఖ అధికారులను పిఒ అడిగి తెలుసుకున్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల భూములలో ఏ వ్యవసాయం చేస్తున్నదీ, గతంలో గిరిజన రైతులకు ఐటిడిఎ ద్వారా అందించిన పవర్ టిల్లర్లు, మినీ రైస్ మిల్స్, ట్రాక్టర్లు, రోటవేటర్లను రైతులు ఏ విధంగా ఉపయోగిస్తున్నారో ఆరా తీశారు. గిరిజన రైతులందరికీ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. గిరిజన రైతులకు అపరాల పంటలు వేసుకొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. వెలుగు, హార్టికల్చర్ శాఖల ద్వారా వందన్ వికాస కేంద్రాలతో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏజెన్సీలోని మహిళా సంఘాలకు ఎన్ని యూనిట్లు కోళ్ల ఐటీడీఏ ద్వారా అందజేసింది, ప్రస్తుతం ఏ దశలో ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఏయే గ్రామాలలో వ్యవసాయం చేస్తున్నదీ, ఎంత మంది గిరిజనులు, ఎన్ని ఎకరాలలో చేస్తుందని ఆరా తీశారు. మత్స్యశాఖ ద్వారా రైతులకు ఏయే సేవలందిస్తున్నదీ, పందిరిడి మామిడి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది గిరిజనులకు చేప పిల్లలు సరఫరా చేసిందీ, ఎన్ని ఎకరాలలో మత్స్యశాఖ వ్యవసాయం చేస్తున్నదీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లో జాప్ర సాగు తీరుపై ఆరా తీశారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి చౌదరి, కె.సావిత్రి, జిసిసి సీనియర్ మేనేజర్లు పార్వతీశం, ముర్ల రాజారెడ్డి, జి.చంద్రశేఖర్, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ బిఎంయు.రామరాజు, ఏఎస్ఓ కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, వివిధ శాఖల అధికారులు

బోరుబావులకు మరమ్మతులు చేపట్టాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

వరదల వల్ల పాడైపోయిన బోరుబావులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని కుమ్మూరు సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో తాగునీటి కోసం బోర్లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేవారు. తాగడానికి నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి రూ.10వేలు సాయం అందిస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేసి నాలుగు నెలలు కావస్తున్న నేటికీ దాని అమలుపై అధికారులు శ్రద్ధ పెట్టడం లేదని పేర్కొన్నారు. 2022 జులై వరద ముంపును ప్రామాణికంగా తీసుకొని పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుంజ సీతారామయ, ముర్రం రంగమ్మ, సవలం నారాయణ, మడకం శంకర్, మడకం దుర్గారావు, సవలం సీతమ్మ, కురసం కృష్ణమూర్తి, కురసం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సురేష్


అప్రోచ్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్ పనులు : ఎంపిపి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని అన్నవరం వాగు వద్ద అప్రోచ్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి ఆదేశించారు. శుక్రవారం సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులతో కలిసి పనుల పురోగతిని ఎంపిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ అనేక తుపాన్లకు అన్నవరం బ్రిడ్జి కొట్టుకుపోయిందని, దీని నిర్మాణానికి వివిధ రూపాలలో అధికారులకు విన్నవించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం అప్రోచ్ పనులు నిర్మిస్తేనే డైవర్సన్ నిలబడుతుందన్నారు. వచ్చే వర్షాకాలం రాకముందే అన్నవరం వాగుపై వంతెన స్థానంలో ఐ లెవెల్ వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పంకు సత్తిబాబు, కమ్మచిచ్చు సత్యనారాయణ, కారం సుందరయ్య, అజరత్, పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకుని భూములకు శాశ్వత భూహక్కు పత్రాలను పొందాలని మండల తహసీల్దార్ తిరుమలరావు ప్రజలకు సూచించారు. భూ రీ సర్వేలో భాగంగా వారసత్వంగా సంక్రమించే భూములకు మ్యూటేషన్, తప్పులు సరిదిద్దేందుకు వీలుగా అందరూ కలిసి రావాలని సూచించారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని సున్నపాడు పంచాయితీ పరిధి దేవరపల్లి, వేటుకూరు పంచాయితీ పరిధి ఇవ్వంపల్లి గ్రామాలలోని పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద చేపట్టనున్న పనులకు ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి, త్వరగతిని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కోండ రవి కుమార్, ఎంపీడీవో వీర కిషోర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, సున్నంపాడు ఎంపిటిసి సభ్యుడు అనిల్ కుమార్, వేటుకూరు, సున్నంపాడు సర్పంచ్‌లు లచ్చిరెడ్డి, మల్లీశ్వరి, వైసిపి మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బోడ్జెటీ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లి పాఠశాలలో నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

పట్టభద్రులంతా ఓట్లు నమోదు చేసుకోవాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ



గాజువాకలోని ప్రైవేటు స్కూల్లో మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి -గాజువాక : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ కోరారు. శుక్రవారం గాజువాకలోని భాష్యం స్కూలు, చైతన్య కళాశాలలతోపాటు తోకాడ, గాజువాకలోని పలు ప్రాంతాల్లో సందర్శించి, అర్హులైన పట్టభద్రులను కలిసి ముందుగా తమ ఓటు హక్కును ఈనెల 7లోగా నమోదు చేసుకోవాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేస్తున్న తనకు ప్రథమ ప్రాధాన్య ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. రమాప్రభతోపాటు ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి, నాయకులు సంతోషం, వార్డ నివాస నాయకులు కిరీటం, త్రినాధ స్వామి, భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ భారతి, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింహగిరి రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న శారదా పీఠాధిపతి

ప్రజాశక్తి - ఆరిలోవ : సింహాచలం కొండపరిధిలో దిగువది నుంచి జ్ఞానానంద ఆశ్రమం వరకు రూ.5 కోట్ల ఎంపీ నిధులతో రక్షణ గోడ నిర్మాణానికి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ, సింహాచలేసుని భూములతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉండే రక్షణగోడ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆక్రమణలకు గురవుతున్న దేవస్థానం భూములను, దేవాలయ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సింహాచలం పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. పంచగ్రామాల భూసమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంపి విజయసాయిరెడ్డి, టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేవస్థాన భూముల పరిరక్షణకు ఎంపి నిధులతో పాటు మరిన్ని నిధులు సేకరించి కొండచుట్టూ రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమరనాథ్, ఎంపి సత్యవతి, విఎంఆర్‌డిఎ చైర్పర్సన్ అక్రమాని విజయనిర్మల, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ధర్మశ్రీ, అదీప్‌రాజు, టి.నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాదర్బార్‌లో కాంగ్రెస్ నేతలు డిమాండ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయి మోహన్‌రావు డిమాండ్ చేశారు. అరకు అసెంబ్లీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. మాతృభాషా వాలంటీర్లను, ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న హెల్త్ వాలంటీర్లను రెన్యూవల్ చేయాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో మారుమూల లోతేరు, బస్కి, పెదలబుడు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు గొల్లూరి పద్మ, పార్టీ నాయకులు జంపరంగి వెంకట్ బాబు, మజ్జి అద్దు, కోర్రా రఘురాం, కోర్ర అప్పారావు, సిదేరి రాధాలక్ష్మి, చిక్కుడు అప్పలమ్మ, గుంజుడి సుబ్బారావు, శెట్టి భగత్ రామ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భూసార పరీక్షలు



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాంకేతికత ఆధారంగా నేల స్వభావం, పోషకాల లభ్యతపై నూతన పద్ధతులతో కాన్పూర్ ఐఐటి ప్రతినిధులు భూసార పరీక్షలు జరిపారు. శుక్ర వారం భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, భూపరిరక్షక్ అనే నూతన పరికరం ద్వారా కేవలం రెండు నిమిషాల్లో మట్టి నమూనాలు పరీక్షించారు.

భీమిలి మండలం సింగన బంద, చిప్పాడ, కాపులుప్పాడ, ఆనందపురం, పద్మనాభం మండలం రేవిడి, కోరాడ గ్రామాల్లో పర్యటించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె అప్పలస్వామి ఆధ్వర్యంలో కాన్పూరు ఔట్‌రీచ్ సెంటర్ నోయిడా ఐఐటికి చెందిన ఆగ్రో నెక్స్ట్ సర్వీసెస్ బృందానికి నేతత్వం వహించిన ఇషాంత్‌రావు తదితరులు రైతుల సమక్షంలో భూసార పరీక్షలు చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎ శిరీష, విశాఖ, అనకాపల్లి , భీమిలి ఎడిఎలు టి.శ్రీదేవి, జె.ప్రసాద్, బొడ్డేపల్లి విజయప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు బి శివకోమలి, నాయక్ పాల్గొన్నారు.

జ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయించాలి

యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ఛాన్సలర్ ఆశ్వని వోలిటి



ఆశ్వని వోలిటిని సత్కరిస్తున్న విసి ప్రసాదరెడ్డి తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : తరగతిగదిలో పొందిన జ్ఞానాన్ని నిత్య జీవితంలో అన్వయించడం ఎంతో అవసరమని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ఛాన్సలర్ డాక్టర్ ఆశ్వని కె వోలిటి అన్నారు.

శుక్రవారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించి, విసి ఆచార్య పివిజిడి. ప్రసాదరెడ్డితో ఆత్మీయంగా భేటీ అయ్యారు. ఎయు పూర్వ విద్యార్థి అశ్వని వోలేటి అమెరికాలో ప్రముఖ విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా నియమితులు కావడం పట్ల విసి ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేసి, సత్కరించారు. అనంతరం పాలక మండలి సమావేశ మందిరంలో రెండు విశ్వవిద్యాలయాల ప్రతినిధుల బృందం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా అశ్వని వోలేటి మాట్లాడుతూ జ్ఞానాన్ని అనువర్తింపచేయడం ఎంతో అవసరమని, ఎయు ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తోందన్నారు. స్టార్టప్, ఇంక్యుబేషన్‌లు ఈ కోవకు చెందుతాయన్నారు. ఉపాధి కల్పించే స్థాయికి యువతను తీర్చిదిద్దడంలో ఎయు ప్రయత్నాలు సఫలం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఎయు అనుసరిస్తున్న విధానాలు ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. నూతన విద్యా విధానం బాగుందన్నారు. భవిష్యత్తులో ఫార్మశీ, హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్, ఫిన్‌టెక్ రంగాలలో కలసి పనిచేసే దిశగా ఆలోచన చేయాలని ఆహ్వానించారు.

ఎయు విసి ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ యువత శక్తిని సద్వినియోగం చేసుకునేలా వారిని తీర్చిదిద్దే కార్యక్రమాలను చేస్తున్న విధానం, ఇంక్యుబేషన్ సెంటర్ పనితీరును వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలిగా డీన్ డాక్టర్ రోబర్ట్, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ చైర్ హెన్రీ, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ కె.శ్రీనివాసరావు, పేరి శ్రీనివాసరావు,ఆచార్య జ్ఞానమణి, డీన్‌లు కె.బసవయ్య, ఇ.ఎన్ ధనుంజయరావు, టి.షారోన్‌రాజు, డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు 6097 దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 6097 దరాఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో 5038, ఆఫ్‌లైన్‌లో 1059 దరఖాస్తులు అందాయని, వాటిని పరిశిలించి ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి పంపించటం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ నెల 7 వరకు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ జిడి బాబు

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయలో శుక్రవారం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అరకులోయ మెయిన్ రోడ్డులో సీఐ జీడి బాబు నేతృత్వంలో వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, అతివేగంగా డ్రైవింగ్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు పిల్లలకు ఇచ్చిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ రికార్డులు కలిగి ఉండాలని, మద్యం సేవించి నడిపితే సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.ప్రస్తుతం అరకులోయలో పర్యాటక సీజన్ కావడంతో వాహనాల రద్దీ, రాకపోకలు పెరిగిందని, దీని దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ పై దృష్టి సారించామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చేపట్టిన అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్ పాత్ పై వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైద్యానికి జైలు సిబ్బంది వితరణ



సాయం అందజేస్తున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

ప్రజాశక్తి - ఆరిలోవ : అరుదైన హృద్రోగంతో బాధపడుతున్న విశాఖ కేంద్రకారాగారంలో వార్డరు లక్ష్మణరావు కుమారుడు ఆదిత్యరామ్‌కు అవసరమైన చికిత్స కోసం తమ వంతు సాయంగా జైళ్ల శాఖ సిబ్బంది గార్డింగ్ ఫోర్స్ యూనియన్ తరపున రూ 1.89 లక్షల ఆర్థికసాయం అందించారు. శుక్రవారం విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ చేతుల మీదుగా బాధితుడు తండ్రి లక్ష్మణరావుకు అందజేసారు.కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సతీష్, ట్రెజరర్ సూరాడ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లపు వెంకట్

17న అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-చింతూరు : ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 17న రంపచోడవరంలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం జరిగిన అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్లతో వెట్టి చాకిరీ చేయిస్తూ వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 40 కార్మిక చట్టాలను మార్పు చేసి పెట్టుబడి దారులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్స్‌ను బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ మహాసభలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులుగా సవలం వెంకటరమణ, కార్యదర్శిగా పోడియం సావిత్రి, సహాయ కార్యదర్శులుగా వేక వసంతకుమారి, భద్రమ్మ, ఉపాధ్యక్షులుగా లలిత, జయ, కోశాధికారిగా పార్వతి, 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

ముంపునకు గురైన ప్రతి ఇంటికీ నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- విఆర్.పురం : కూనవరం మండలంలో జులై, ఆగస్టు నెలలో వచ్చిన భారీ వరదలో మునిగిన, కూలిన ప్రతి ఇంటికీ ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. కూనవరం మండలం రేపాక గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ సమావేశం మాజీ సర్పంచ్ మడకం బొజ్జి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బొర్రయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన భూములకు ప్రభుత్వాలు నష్ట పరిహారం ఇవ్వకుండా నీటిలో ముంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మునిగిన భూములలో వ్యవసాయం సాగు చెయ్యలేని పరిస్థితిలో గిరిజనులు రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు ముంపు లేని ప్రాంతాల్లో గిరిజనులకు భూమికి భూమి ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మడకం జోగయ్య, ధర్ముల లక్ష్మయ్య, రమేష్, సత్యనారాయణ, మడకం రాజయ్య, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు తరలివెళ్లిన విభిన్న ప్రతిభావంతులు

ప్రజాశక్తి - సీలేరు : చింతపల్లి ఏఎస్‌పి శివ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ 4, 5 తేదీలలో చింతపల్లిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపునకు సీలేరు నుంచి 90 మంది వికలాంగులు శుక్రవారం వెళ్లారు. వీరిని పోలీసులు సీలేరు పోలీస్ స్టేషన్ నుంచి బస్సులో పంపించారు. ఈ బస్సును ఎస్సై రామకష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మరేవులు, గాలికొండ పంచాయతీలకు చెందిన 90 మంది వికలాంగులను ప్రత్యేక బస్సులో తరలించామని తెలిపారు. చింతపల్లి సదరం శిబిరంలో వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఐటీడీఏ పీవో చొరవతో చింతపల్లి ఎఎస్‌పి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదరం క్యాంపు వీరికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఉపాధి ఒట్టిమాటే..!

ఎన్ఎఒబిలో నిర్వాసితులకు మొండిచెయ్యి అవస్థల్లో నేవల్ బేస్ బాధితులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్స్ బేస్ (ఎన్ఎఒబి) నిర్వాసిత కుటుంబాల్లో అర్హులైన అభ్యర్థులకు కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామన్న ప్రభుత్వ జిఒ అమలుకావడంలేదు. నిర్వాసిత కుటుంబాలకు ఇవ్వాల్సిన ప్యాకేజీ మొదలుకొని, ఉపాధి వరకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలేవీ సరిగా కార్యరూపందాల్చలేదు. దీంతో అనివార్యంగా ఇచ్చిన హామీల అమలుకోసం నిర్వాసితులు, ఎన్ఎఒబి ప్రభావిత ప్రజలు ఆందోళనకు దిగాల్సివస్తోంది. పుట్టు ప్యాకేజీ కింద లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి రూ.50 వేలు ఇచ్చారని నిర్వాసితులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎన్ఎఒబిలో నిర్వాసితులైన వేల్పుగొండుపాలెం, దేవళ్లపాలెం, రేవువాతాడ, పిసినిగొట్టిపాలెం ప్రజలకు పునరావాసం కల్పించిన నేవీ కాలనీలో ఉపాధిలేక పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. మహిళలు బ్రాండిక్స్, ఇతర కంపెనీల్లో పనులకు వెళ్తుంటే, మగవాళ్ల గతంలో చేయని మట్టిపనులకు వెళ్తున్నారు. గంప మహిళలకు ఇస్తామన్న లక్ష రూపాయల ప్యాకేజీ పదిహేడేళ్లవుతున్నా చెల్లించలేదని నిర్వాసితులు వాపోయారు. నిర్వాసిత కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా కేంద్రీయ విద్యాలయం నిర్మిస్తామన్న మాట నెరవేరలేదు. ఆసుపత్రి నిర్మాణ హామీ అమలుకునోచుకోలేదు. నిర్వాసితుల సమస్యలిలావుంటే ఎన్ఎఒబి ప్రభావిత గ్రామాల ప్రజలు మరో సమస్యతో బాధపడుతున్నారు. ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుండగానే చేపల వేటకు ఇబ్బంది లేకుండా జట్టీ నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎన్ఎఒబి నిర్వాసితులు, ప్రభావిత ప్రజల సమస్యలపై పోరాటాలు జరుగుతున్న ప్రతిసారీ హామీలు ఇవ్వడం, తరువాత నెరవేర్చకపోవడంతో ఉన్నకొద్దిపాటి పనులు కూడా మానుకొని ఆందోళనకు దిగాల్సివస్తోంది. ప్రతిపక్షంలో వున్నప్పుడు నిర్వాసితుల పక్షాన మాట్లాడ్డం, అధికారంలోకి వచ్చాక వారిని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిన ఫలితంగా సమస్యలు పరిష్కారంకావడంలేదు. చలో కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా 2011 సెప్టెంబరు 28న కలెక్టర్ లవ్‌అగర్వాల్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదు. గంప మహిళలకు, 18 ఏళ్లుదాటిన యువకులు, వితంతువులు, వలస కూలీలు, ఇతర తరగతులకు ప్యాకేజీ వర్తింపజేస్తామని చెప్పినా సంపూర్ణంగా నెరవేరలేదు. 2018 ఆగస్టు 21న కలెక్టరేట్‌లో ఎన్ఎఒబి నిర్వాసిత, ప్రభావిత గ్రామ పెద్దలు, జాయింట్ కలెక్టర్ సృజన, యలమంచిలి ఎస్‌డిసి భాస్కరరెడ్డి, అనకాపల్లి ఆర్‌డిఒ ఎంవి.సూర్యకళ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఇతర అధికారుల సమక్షంలో జరిగిన సమావేశంలో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో మళ్లీ నిర్వాసిత, ప్రభావిత ప్రజలు ఆందోళనకు దిగారు. సముద్రతీరంలో డ్రెడ్జింగ్ పనులు చేయడంతో పడవలు పెట్టుకొనే అవకాశంలేని మత్స్యకారులను శారద, వరహా నదుల్లో పడవలు పెట్టుకొనేందుకు అనుమతించిన నేవీ అధికారులు, ఇప్పుడు సబ్‌గేట్లు మూసేయడంతో చేపల వేటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

7న గిరిజన సంఘం మండల మహాసభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి బోదులూరు సెంటర్‌లోని పాత ఎంపీడీవో భవనంలో గిరిజన సంఘం మండల మహాసభ ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం జిల్లా నాయకులు ఇ.సిరిమల్లి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో ఏజెన్సీలో నెలకొన్న గిజనుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు వివిధ గ్రామాల నుండి ప్రజా ప్రతినిధులు, గిరిజన ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ప్రధానిగారూ..

ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించరూ..

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 11న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కోరింది. ఈ మేరకు శుక్రవారం ప్రధానికి పంపిన లేఖను మీడియాకు విడుదల చేసింది. లేఖలోని అంశాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, వైస్ ఛైర్మన్ పి.రామారావు, కోశాధికారి బిబి.గణేష్, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్ఎస్.శివశంకర్, ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు వివరించారు. గతంలో 2016, 2019ల్లో ప్రధాని హోదాలో మోడీ విశాఖ నగరాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. నాటి నుంచీ ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. సరికదా 32 మంది యువకులతో సహా అనేక మంది తెలుగు ప్రజల త్యాగాలతో స్థాపించబడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతం విభజన తర్వాత కూడా మరింత వెనుకబాటులోనికే నెట్టబడిందన్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించాలన్నారు. ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు.

అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన విశాఖపట్నం ప్రధాన కార్యాలయంగా రైల్వే జోన్ పూర్తి స్థాయి పని కోసం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ పని వెంటనే మంజూరయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 93, షెడ్యూల్ XIIIలో భాగంగా పెట్రోలియం, గిరిజన విశ్వవిద్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాబూ జగజ్జీవన్ రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో సహా ఈ ప్రాంత పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న వీర కిషోర్

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

సచివాలయం సిబ్బంది విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో వీర కిషోర్ హెచ్చరించారు. మండలంలోని డి.వెలమలకోట, తాడేపల్లి సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా సచివాలయంలో పలువురు సిబ్బంది ఎటువంటి కారణం లేకుండా విధులకు గైర్హాజరావడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు హజరుకాని సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సిబ్బంది బయటకు వెళ్ళేటప్పుడు రిజిస్టర్లో కారణం రాసి వెళ్లాలని ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామాలలోని పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు ఫేజ్2 పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత తప్పకు పాటించాలని సూచించారు. విద్యా బోధన ఏవిధంగా ఉంది, మోనూ ప్రకారం భోజల పెడుతున్నారా వంటి అంశాలపై ఆరా తీశారు.



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి రమేష్

జగనన్న ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి, నల్లగొండ గ్రామాలలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఎంపిపి బడుగు రమేష్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యవేణి, రావణాపల్లి సర్పంచ్ కాకూరు లక్ష్మి, నల్లగొండ సర్పంచ్ రాజకుమారి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ముసలి నాయుడు, నాయకులు కొప్పు రాజులమ్మ, హౌసింగ్ డిఇ, జేఈ, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు..

సీలేరు : జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీలో సర్పంచి ఎం. కమలమ్మ శుక్రవారం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుమ్మరేవులు పంచాయతీ పరిధిలో 93 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు శుభ్రం చేసి నిర్మాణం చేపట్టడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.బాబురావు, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.